# పు(రెకో బుద్ధి జివ్వకో రుచి

కోడలమ్మ వుత్తమనిషిగాదు. నిండు(పాణం గిసొంటప్పుడె నోరేమొ పాపం పుణ్ణె మంట రసులు గోర్తదని అప్పుడె జొన్నసేంద్ల కెళ్లి దెచ్చిన పుంటికూరల శెనిగెపప్పేసి పుల్లగ పులుసు కూర వొండితె ఆబంగారుతల్లి మూతి మూడుదిక్కులు గాంగ తూర్పు నుండి పడమర దాంక దిప్పుకుంట ముక్కువట్క గూసుండె. అందికె అన్నరు పెద్దలు జివ్వకోరుచి పు(రెకో బుద్ధి అంట అని మా పక్కింటి సీతమ్మ నిత్తెపారాయిణం మొదలు వెట్టింది.

ఈతీర్గ సీతమ్మ పాడె నివాళులు దండుకాలు జోలలు మేలుకొల్పులు మాకేం కొత్త గావు. అయినగని యీయాళ్ల మాటమీది మాటతీర్గ ''జివ్వకోరుచి పు(రెకో బుద్ధి'' అంట అన్న పలుకువడి కోటివరాల మూటోలె మెరిసింది . దీనిలోతు పాతు ఇంత అంత అంట సెప్పలేము.

భూమండలం మీదున్న మణుసుల అనుభవాలను సొంతం సల్లజేసి తీసిన ఎన్న ముద్దోలె అనిపిచ్చింది. ఒక్కరెప్పపాటంత సేపట్లనె శనా, సంగతులు రంగం మీదికి ఎక్కి ఆడి దిగిపోయె బొమ్మలోలె ఒగదానెంట ఒగటి కండ్లల్ల మెదుల్కం మెదలువెట్టినయి. అవునుగద ? లేకపోతె ? శారదమ్మకేంతక్కువ? చెంపకు సొరడెసికండ్లు నల్లగ బింగణ్ణ రెక్కలోలె నిగనిగ మెరిసె తలకట్టు .పొన్నకాయెతీర్గ పొంకమైన పెయ్యి పొందికం పొద్దు గుట్టు మట్టు గల పిల్ల.

కడ్గిన ముత్తె మసొంటి ఆ పిల్ల నొల్లక దానిమొగుడేమొ యీ పిల్ల ఎడ్మకాలిగోరు కన్న కొరగాని మిటారి మిణ్కుల మిస్సమ్మ జతగూడి'' మైడీయరు సీర్‌ఫుల్ చిర్ప్'' అని వుత్తురాలు రాసుకుంట ఎంటదిర్గు తుండడు.

అయ్యో ! అంతెందుకు? మా రాజన్ననె జూడరాదుండి పల్క పెయి బారెడు ఎద నిండు మొగులసొంటి ద్వని యింగ సబలల్ల నిలవడి గొంతెత్తి పద్దెం సదివిండంటె జనం

వంత మంత్రపు నీళ్లు జిల్కరిచ్చినట్లు మచ్చుజల్లినట్లు కనికట్టేసినట్లు కదులకుండ మెదుల కుండ సిత్తారిబొమ్మల తీర్గ నిలవడి యింటరు మరి ? అసొంటి బుద్ధిశాల్ని గట్టుకున్న ఆ పెండ్లాం తల్లి ఒక్కనాడన్న నిండుగ నగింద ? మురిసింద ? ఎప్పటికి ఏందో ? లేదంట ఆపసోపాలు. వోనాడు నేను ఆతల్లిని జూసి 'వొదినె ! ఎన్కటి జన్మల ఎంతపెట్టి పుట్టినవొ నీకు మా అన్న దొరికిండు అని అనంగనె

రొండు బొమ్మలు దగ్గెరికి రొండు సింగిణీలు గల్సినట్టు ముడేసి అఁవును ! ఎవరి సెట్టుపువ్వు వాళ్లకు వాసన గాదా? మరి? ఈకయితలు సదువులు కడ్కతాగుతమా ? నములక మింగుతమా ? ఏం ! లాబం ? వుప్పుకా ? పప్పుక ? పసురానికి తిన్నది ఆసర మనిషికి వున్నది ఆసర అన్నరు పెద్దమణుషులు కావాల్సినంత పేరు వుండది లేదన్నానా? 'సూస్కముర్సెరూపు సెప్కఏడ్సె బతుకు' అని మళ్ల నోరెత్తకుండ నానోటికి సిక్కు తాళం ఏసినంత పనిజేసింది.

చెప్పమర్శిన సామెతకు సాక్షీకం గావాల్నంటె వాళ్ల వీళ్లదాంక ఎందుకు ? నాముచ్చెటనె దీస్కోర్రాదుండి. ఆత్యాప యా దిక్కున సుక్కవొడ్సిందొ ? యా మొండి సెట్టు సిగురేసిందొ గని మా జుట్టు పుంజు నా ఎంబడి వొస్తనని మా తల్లి గారింటికి పయిన మైండు. సూడు సూడుమంట యాళ్లకు బండిగుడ అందరాలేదు. బండొచ్చెవరకు ఈ దుంకుడు పంతుల్ను ఎట్ల సంబాళిచ్చాల్నంట బుగులు బుగులు మంటుండది. ప్రాణం గని నా అంశకొద్ది,

అనాడు జాతరతేరు సాగుతుండది. ఆజాతర్ల తీరుతీరొక్కదుకాణాలు వడ్డవి. దళ్లు పందిళ్లు, డేరలు, గుడారాలు ఏసి తమాసలు జూపుతుండరు. వోకాడ గవ్వలు గురేటుపందెం యిస్పేటాట సరిబేష్ ఆట పులికట్ట ఇసొంటి ఎన్నో ఆటల పంద్యాలు ఆడ్తుండరు. ఆడ వొగాయిన మేంజూస్తుండంగనె వానగుంతల పీట ఆటలల్ల లిబ్బికి లిబ్బి ఎత్తుకున్నట్లు వోరాగి పైసేసి జవురి జేబుల గుక్క కుంటుంటె పక్కల నిలవడి సూస్తున్న దోస్తు ''వద్దురా ! తమ్మి ! యిది మనుసుకు కుసి నింపె ఆటగాదుర నాయిన లెక్కల పరీక్ష యిచ్చినట్లు నిగ్రంగావాలె, ఈడ మనుసూ సూపు రొండు ఒక్కసోట గుదిరిచ్చి నవ నాళాలు బిగవట్టి యోగితీర్గ గూసోవుంటె నాశాతగాదుర. ఈవుల్ఛలాబం వొద్దు ప్రాణసంకుటం అంతకంటె వొద్దు. అని దులిపిచ్చుక పోయిండు.

అడ్నె యింగోకాడ అందరు అడీ మొగ చిన్నా పెద్ద అనె ఏరుతారు లేకుండ

సబ్బుండ జాతి ఏకమైనట్ల బార్లుగట్టి నిలవడి తీరొక్క ముచ్చెట జెప్పుకుంటుండరు.

మనిషి అంటె వాడెమనిషి నిప్పు ఆఁ నీకమెప్పితం ఆనిప్పుతున్క ఆనిప్కతాను దినకపాయె ఎవరన్న దింటె వోర్వకపాయె పురాగ అంటకు ముట్టకంట వుట్టెక్కినట్ల మడి గట్టుకుంటె ఎట్ల ? మీరునూరనుండి వెయ్యనుండి.

వూళ్లెకల్ల సెప్పుకోదగ్గోడు సుబ్బయ్యనె రొండు లంకెబొక్కెన్ల నిండ అషరఫీలు - ఆఁ ! ఏముంటేంది ? ఎంతుంటె ఏం సార్తుకం ? పూటకు వో రొండు గంటెల సన్న బియ్యపు మెతుక్కలర్గవు.

ఈ యిర్కటంల నాట్కం జూస్తావె ? తాత ! వొద్దా ? మన్మడ అవురా ? పండాకు రాలంగ పసరాకు నగిందంట ముందుండది బిడ్డ ముసుళ్ల పండుగ అప్పడె తుళ్లిపడకు !

ఇంతట్లకె దొంగ దొంగంట లొల్లి వుట్టింది అల్గెల్లిన నీళ్లోలె మందంత చిల్లం పొల్లం గావట్టిను.

నాట్కం ల ఏశెం గట్టిన సత్తెబామ చెలికత్తె జలజమ్మను సోయిదప్పి సూస్తున్న శేషుబాయి మెల్ల పట్టెడ మెడమీదికెళ్లి అమాంతం కొలికి దప్పిచ్చి కంట్ల కనుపాపను దీసి నట్ల దీసి కీసలేస్కోను పోతుంటె కాలం గల్సిరాక చేయిదప్పి వోయి మానస్తుని సేతిమీద వడ్డది అందికె అంతలొల్లి.దేవుడన్న జాతరన్న అందరు వొక్కసూపు తోటి రారు తీరొక్కరికి తీరొక్కగురి . ఆమ్మో యిది అనుముజూసి అమురవట్క వోయె తావు అంట అనుకుంట అందురం నాట్కంలకు నడ్సినం.

తెరమీదికి సత్తెబామ ఏశంవొచ్చింది బామగొంతు నెమలిగొంతు కేకోలెఏడో సొరాన్ని అందుకుంటుంటె పాటమర్మం దెల్శిన సంగీతకాడు సెబాసనంగ మెట్టొరుస దుంకుతుండదిర ! అని బాగోతాల రాముడు సై అంటె ఆ ఈ వొన్నెలు జూసెటప్పుడు కానొచ్చె దాని పై వొంపులు తీర్సిదిద్ది నట్లుండవి అంట, చిత్తారిసూపు మెచ్చులు గుమ్మరిస్తుండవి గని,

నామనుసంత ఆ ఎదురు దుకాండ్లల్ల గానొచ్చె రంగురంగుల రేషంగాజులు కేసరి కుంకుమల మీదనె వుండది. అందుకోసం మా మొగాయినను అస్కరం పుస్కరం అంట ఆయీామాటలల్ల వడేసి మెల్లెగ ఆడికెళ్లి మళ్లిచ్చి నాగ్గావల్సిన బాటవట్టిచ్చిన. ఇట్ల జెర దూరం నడవంగనె ఆయిన కన్ను వుస్కల గీసిన వో బొమ్మ మీద వడ్డది. ఎందో?

సూడక సూడక సూసినట్లు పోగొట్టుకున్నది కన్నట్లు ఆయిన కండ్లు తళుక్కున మెర్సినవి, అన్నిమర్శి ఆణ్జె నిలవడి పోయిండు. ఇంతఎలుగు ఈయిన కండ్లల్ల నేనెన్నడు జూడలేదు. యీకొత్త మెరుపు జూసి నాప్రాణం పుల్లసింతకాయ గొర్కినట్లె నెత్తొంచు కున్నంత పని జేసింది.

ఇంతట్లకు మావోండ్లు బంపిన బండి దోలుకొచ్చిన మా బాలడు 'దొరా! బండి గట్టిన ఎక్కుండయ్యా' అన్నడు. ఎక్కికూసున్నం గని,

నామనుసు మనుసులలేదు. తామసం ముంచుకొచ్చింది. వూకూకె ఆయిన కంట్ల జూసిన ఆమెరుపె యాదికొచ్చి ఈయనకు నాకంటె ఆ సిత్తారి బొమ్మనె ఎక్కువ మనుసు కెక్కింది ఏందో ? నేను ముద్దుగ లేనేమొ ? నన్ను మెచ్చిన మొగడంట నాకెంత దిమాకి వుండేది. యియ్యాళ్ల యీబొమ్మ నా నీల్గుడంత దింపింది అంట రుస్సు రుస్సు మను కుంటనె లేక లేక తల్లిగారింటికి వోయి ఆడ రద్దీరాశ కారం ఎందుకంట ఆయినను తప్పిచ్చుక తిర్గిన. ఈ దాగిళ్లు మూగిళ్లాట ఎందుకో పాపం ఆయినకు దెల్వనే లేదు.

ఈ యాళ్ల మా సీతమ్మ నాకండ్లు దెరిపిచ్చింది. ఆమె సామెత నాఎదకు సూటి గొచ్చి తాకింది. నిజంగనె! ఈలోకంల ఎచ్చుతచ్చులకు మంచి సెబ్రలకు ఎన్నెల సీకట్లకు ఏర్పాట్లకు కలెగల్పులకు యాదోకారుణం యావ అంట వుండాలె. అట్ల లేకపోతె తీపి రుచి యాడుంటది. వొంకరలేని పొంకం యాండది. ?

అందరి రుచులు వొక్కటైతె ఇన్ని రుసులెందుకు? అందికె ''జివ్వకోరుచి పుర్రెకొబుద్ధి '' అన్నరు. అనుకోని మాడ్పుమొకం యిడ్సి నెత్తిదువ్వుకోని ఇరవూసిన దొంతిమల్లె కొప్పున వెట్టుకున్న. ఆరాత్రి ఎన్నెలమ్మ యిర్గవడినగింది.